క్లుప్తంగా

విధి నిర్వహణలో అలసత్వం వీడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో అలసత్వం విడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 7, 19, 36 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే శానిటరీ డివిజన్ కార్యాలయాలను తనిఖీ చేసి అటెండెన్స్‌ను పరిశీలించారు. సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

కొల్లిపర: పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో డిసెంబర్ నెలల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపులను ఆయా గ్రామంలోని విద్యార్థులు, ప్రజలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, అత్తోట, కొల్లిపర గ్రామాలల్లో హైస్కూల్ మంగళవారం ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, ఆధార్ ఏవిధంగా తీస్తున్నారు అన్న అంశాలను పరిశీలించారు. వచ్చిన వారికి, విద్యార్థులకు ఆధార్ కార్డు ఉండటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. విద్యార్థుల్లో వారి ఆధార్ కార్డులో తప్పులు ఉన్నా, ఫోన్ నెంబర్ అనుసంధానం లేని వారు వెంటనే ఆధార్ కార్డులలో మార్పులు చేసుకోవాలని అప్పుడే విద్యార్థులకు ప్రభుత్వం అందించే పుస్తకాలు, తల్లికి వందనం వంటి పథకాలు వస్తాయని తెలిపారు.

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై 3వ బ్యాచ్ కి మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ 2030వ సంవత్సరం నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 9 లక్ష్యాలు, 2047వ సంవత్సరం నాటికి 17 లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి సచివాలయం సిబ్బందికి వివరించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మాస్టర్ ట్రైనీలు ఈవోపిఆర్డీ సి.హెచ్.భార్గవ, ఎంపీహెచ్ఓ వి.లక్ష్మి, ఐసీడీఎస్ అధికారి కె.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ సుధాకర్, ఎంపీఎం పి.రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికా వికాసంపై అవగాహన

బాపట్ల: కిశోర బాలికలకు పౌష్టికాహారం అందేవిధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాపట్ల సీడీపీఓ లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసమావేశంలో సీడీపీఓ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, సామాజిక సాధికారిత, బాలల హక్కులు, చట్టాలపై ట్రైనర్స్ ద్వారా అవగాహన కల్పించటం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో బాబురావు, ఎంఈఓ నిరంజన్, ఏపీఎం సురేష్ బాబు, డీసీపీఓ పురుషోత్తమరావు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కర్లపాలెం: కిశోర బాలికలకు సమాజంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ బాలికలకు 100 రోజుల పాటు పాఠశాలల కమిటీల ద్వారా విద్య, ఆరోగ్యం, లైంగిక వేధింపులు లాంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే బాలికల సంరక్షణకు, అవగాహనకు మండల స్థాయి గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ రవీంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

ఐలవరంలో నగర సంకీర్తన



ఐలవరం(భట్టిప్రోలు): పవిత్ర ధనుర్మాస మేలుకొలుపును పురస్కరించుకుని సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం భట్టిప్రోలు మండలం ఐలవరం పురవీధులలో నగర సంకీర్తన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దీవి రఘునాథచక్రవర్తి మాట్లాడుతూ ధనుర్మాసం నెల రోజులూ మహా విష్ణువును పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కెబీవీ రమణ, ఫణితపు నాగులు, వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాప్రభో... జీతాలివ్వండి

- అష్టకష్టాలు పడుతున్న పాఠశాల ఆయాలు
- ఆరునెల్లుగా అందక ఆర్థిక ఇబ్బందులు
- ఆరు వేలకే పగలంతా వెట్టి చాకిరి



తూములూరు హైస్కూల్‌లో ఫ్లోర్‌ను శుభ్రపరుస్తున్న ఆయా



కొల్లిపర భవిత కేంద్రంలో శుభ్రం చేస్తున్న ఆయా

కొల్లిపర: అరకొర జీతాలతో అష్టకష్టాలు పడి ప్రభుత్వ పాఠశాలల్లో కొల్లిపర మండలంలో 45 పాఠశాలల్లో సుమారు 70 మంది ఆయాలుగా విధులు నిర్వహిస్తున్న వారికి జీతాలు ఎప్పుడు అందుతాయో? తెలియక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం ఆరు వేల రూపాయలకే ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని పనులు చేస్తూ శ్రమించి విధులు నిర్వహిస్తున్నా ఆరు నెలలుగా జీతాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జూన్ వరకూ మాత్రమే జీతాలు చెల్లించడంతో ఆరు నెలలుగా జీతాలు లేకపోవటంతో కుటుంబ జీవనం ముందుకు సాగక తీవ్ర వెతలకు గురవుతున్నారు. ఆయాలుగా ఉదయం 8 గంటలకే పాఠశాలలకు హాజరై, సాయంత్రం 5 గంటల వరకూ పాఠశాలలోనే గడుపుతున్నారు. ప్రతి ఆయా ఉదయం 8 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు, తిరిగి సాయంత్రం 3 గంటలకు టాయిలెట్స్ శుభ్రపరచడంతో పాటు, తరగతి, ఉపాధ్యాయుల గదులు, పాఠశాల ఆవరణ శుభ్రం చేయడం, మధ్యాహ్న భోజనం అనంతరం శుభ్ర పరచడం వంటి విధులు నిర్వహించడానికి వీరినే వినియోగిస్తున్నారు.

300 మందికి ఒక్కరే ఆయా

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అతి తక్కువ జీతాలతో ఆయాల శ్రమను దోచేస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 100 మంది విద్యార్థులకు ఓ ఆయాను నియమించాలన్న డిమాండ్ ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఇతర పనులకూ కొందరూ వీరినే ఉపయోగిస్తుండడంలో కష్టంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా 6 హైస్కూల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వారికి కూడా ఆరు నెలలుగా జీతాలు లేకపోవటంతో వారు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో మరింత మంది ఆయాలను నియమించడంతో పాటు, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంతలా శ్రమిస్తున్న తమలాంటి ఆయాలకు ప్రతినెలా జీతాలు సక్రమంగా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీతాలు పెంచాలి



పాఠశాలలో ఆయాలుగా అన్ని విధులూ నిర్వహిస్తున్నాం. కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పోల్చి జీతాలు పెంచి ఆయాలను ఆదుకోవాలి. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వెంటనే మొత్తం జీతాలు చెల్లించి, ప్రతినెలా సక్రమంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–అన్నవరపు పద్మావతి, తూములూరు, హైస్కూల్ ఆయా

ప్రతినెలా జీతాలివ్వండి



ప్రతినెలా జీతం అందక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. కుటుంబం గడవటానికి చాలా ఇబ్బందిగా ఉంది. జూలై నుంచి జీతం అందాల్సి ఉంది. బిల్లు మంజూరయ్యాయి.. ఇచ్చేస్తామంటున్నారు. కానీ ఇవ్వడం లేదు. అడిగితే తరువాత నెలలో వస్తాయి తప్పకుండా అని చెబుతున్నారు. ప్రతినెలా జీతాలిచ్చి ఆదుకోవాలి.

–జొన్నలగడ్డ లక్ష్మి, కొల్లిపర, హైస్కూల్, ఆయా

రూ.18 వేలు చెల్లించాలి

కూటమి ప్రభుత్వం ఆయాల శ్రమను దోచేస్తున్నారు. కనీస వేతనం చెల్లించకుండా కేవలం రూ.6 వేలు మాత్రమే చెల్లించడం దారుణం. కనీసం వేతనం రూ.18 వేలు చెల్లించాలి. ప్రతినెలా క్రమం తప్పకుండా జీతం చెల్లించడంతో పాటు ప్రతీ 100 మంది విద్యార్థులకు ఓ ఆయాను నియమించాలి.

–కోటా చంద్రశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి

అధికారులపై మంత్రి మనోహర్ ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: పురపాలక సంఘ అధికారులు గాఢ నిద్రలో ఉన్నారని, వారిలో మార్పు రావాల్సిన అవసరం చాలా ఉందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని బోసురోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. విస్తరణ పనులు లోపభూయిష్టంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులను నమ్మి పనులు చేయించే పరిస్థితి లేదని, కాంట్రాక్టర్‌లు నీరు నిల్వ ఉండకుండా నిర్మాణాలు చేయాలని సూచించారు. అలా చేయని కాంట్రాక్టర్‌ల బిల్లుల చెల్లింపులు నిలిపివేస్తామని హెచ్చరించారు. అలాగే మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆయన ప్రతిరోజు గంటపాటు ప్రధాన రహదారుల వెంట ఉన్న కాల్వలను పరిశీలించాలని ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలను ఆదేశించారు. అలాగే కొన్ని దుకాణాల ముందు వాహనాలు రోడ్లపై పెట్టి ఉండటాన్ని గమనించిన ఆయన వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్లను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. చిన్నపాటి వర్షానికి బోసురోడ్డు నీటితో నిలిచేదని, ఆ పరిస్థితిలో మార్పు తేచ్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధాన మురుగు కాల్వల పూడికతీత పనులు చేయడంతో పాటు రోడ్డు విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. దీని కోసం రూ.45 లక్షలు వెచ్చించినట్లు ప్రకటించారు. వారం రోజుల్లో దాదాపు పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, ఏఈ సూరిబాబు, పలువురు జనసేన నాయకులు ఉన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

తెనాలి: పట్టణ చినరావూరులోగల సత్యనారాయణ పార్కులో జరుగుతున్న అభివృద్ధి /మరమ్మతు పనులను మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనరు బండి శేషన్న, 15వ వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావుతో కలిసి పార్కును మొత్తం కలియదిరిగారు. జరుగుతున్న పనులను పరిశీలించారు. అవసరమైన సూచనలు చేశారు. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, జనసేన నాయకులు తోటకూర వెంకట రమణారావు, హరిదాసు గౌరీశంకర్, శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

తెనాలి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి వైద్యచికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.7.82,026 చెక్కులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వారి కుటుంబ సభ్యులకు మంగళవారం సాయంత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఏడుగురికి స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సాయాన్ని పంపిణీ చేశారు.

మహిళా మీ కోసంపై అవగాహన

తెనాలిరూరల్: జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఏర్పాటు చేసిన 'మహిళాల మీ కోసం' కార్యక్రమంపై పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి పట్టణంలో మహిళలకు ఈ కార్యక్రమం గురించి తెలియజేస్తూ రాత్రివేళ మహిళలు ఇబ్బంది పడకూడదనే జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచినట్లు చెప్పారు. జిల్లాలో రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు 9746414641 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలిజేస్తే పోలీసులు వారికి ప్రయాణంలో అండగా ఉంటారని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వితంతువులకు వస్త్రాల పంపిణీ

తెనాలిరూరల్: పేదలను ఆదుకోవడంలోనే క్రిస్మస్ ఉందని సినీ దర్శకుడు, పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరు గ్రామంలోని పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థలో వితంతువుల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి అధ్యక్షత వహించారు. వితంతువులకు ఆయన నూతన వస్త్రాలను, నిత్యావసరాలను పంపిణీ చేశారు .కార్యక్రమములో సహాయ దర్శకులు నరేష్ దోనె, మణి చింతా తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



చెత్త సేకరణ బాక్స్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానందకాలనీలోని పార్కును మంగళవారం ఉదయం పరిశీలించి పలు సూచనలు చేశారు. సరస్వతి మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశీలించి వెంటనే వాటి మరమ్మతులు చేయించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్త చెదారం సేకరించేందుకు ఏర్పాటు చేసిన ఇనుప బాక్స్‌లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డితోపాటు డీఈ కృష్ణారెడ్డి, ఏఈ డి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ఉప సంహరించుకోవాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు



మాట్లాడుతున్న నాగాంజనేయులు, పక్కన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

భట్టిప్రోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై మోపుతున్న విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని తక్షణం ఉప సంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాగాంజనేయులు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ ఛార్జీలను వడ్డిస్తున్నారని...అసలు కంటే కొసరి అధికంగా ప్రజలపై పడుతుందన్నారు.

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రాగా తీర్చిదిద్దుతామంటున్న కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపడం దారుణమన్నారు. పెంచిన ఛార్జీలను సత్వరమే ఉపసంహరించుకోవాలని లేకుంటే విద్యుత్ వినియోగదారులతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు జి.బాలాజీ, బి.శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిద్దాం

బాపట్ల: స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ సీనియర్ నాయకుడు జె.బి.శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం సమావేశం జరిగింది. ఈసమావేశంలో జేబీ శ్రీధర్ మాట్లాడుతూ ఒకపక్క రాష్ట్రంలో తెలివిగా స్మార్ట్ మీటర్ల బిగిస్తూ పేదల నడ్డి విరిచే స్మార్ట్ మీటర్ల విధానం అమలు చేయమంటూ కూటమి ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వటం విడ్డూరంగా ఉందన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించి వాటితో ప్రభుత్వం అదనంగా ప్రజలపై భారం మోపే ప్రయత్నం చేస్తుందని శ్రీధర్ దుయ్యబట్టారు. ప్రజలందరు వీటిని వ్యతిరేకించాలని, విద్యుత్ బిల్లులు పెంపుదలపై కూడా నిరసన చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్క రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా జిల్లా కన్వీనర్ బిజిలి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అంకమ్మరావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పొట్లూరు ఏసోబు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొల్లూరు: భర్తతో విభేదాల కారణంగా ఓ వివాహిత తన కుమార్తెను తీసుకొని అదృశ్యమైన సంఘటన కొల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన ఈపూరు మనోహర్‌కు తన భార్య నాగమల్లేశ్వరికి మధ్య కొన్ని రోజులుగా విభేదాలు తలెత్తాయి. భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఈనెల 14న తన 9 ఏళ్ల కుమార్తె యక్షితను తీసుకొని ఇంటి నుంచి అదృశ్యమైంది. అప్పట్నుంచి భర్త, బంధువులు పలు ప్రాంతాలలో ఆమె కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మనోహర్ ఫిర్యాదు మేరకు కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బాపట్ల: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో సెమ్మీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ అన్ని మతాలు సమానమేనని, అన్ని మతాల భావాలను గౌరవించుకోవాలన్నారు. మానవుడిగా ఈ లోకంలో పుట్టి లోక పాపాలు తనమీద వేసుకుని లోక రక్షకుడుగా క్రీస్తు అవతరించారని గుర్తు చేసుకున్నారు. క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ప్రార్థించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాండిల్ లైట్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఐఓ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కె జిల్లా అధికారి డాక్టర్ సౌజన్య, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ కళ్యాణ్ గోపి, డాక్టర్ నితిన్, డాక్టర్ మౌనిక, ఎన్జీఓ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి



వృద్ధులను సన్మానిస్తున్న సభ్యులు

తెనాలిఅర్బన్: పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, పి.ఎల్.జి సూర్యప్రకాశరావులు కోరారు. పెన్షనర్స్ డే సందర్భంగా కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో పింఛన్ ఆధారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లిస్తే వారికి ఆసరాగా నిలుస్తామని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని చెప్పారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

- పెన్షనర్స్ డే వేడుకలను ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శివశంకరరావు, కె.బి.ప్రసాద్‌లు మాట్లాడుతూ 2014 సంవత్సరంలో పరిపాలన చేసిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఓపీఎస్ స్థానలలో సీపీఎస్‌ను, ఎన్‌పీఎస్‌ను తెచ్చిదన్నారు. దీని వల్ల ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని పాలకులు విస్మరించారని విమర్శించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు వి.ఆదినారాయణ, వి.ఎస్.భారతి, ఎ.సాంబశివరావు, ఎండీ గౌస్, కె.పూర్ణచంద్రరావు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కలను పంపిణీ చేస్తున్న డాక్టర్ రామ్‌చంద్, శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఏబీవీపీ తెనాలి శాఖ నగర అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అందరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏబీవీపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తెనాలికి చెందిన వేదశ్రీ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అలాగే వేదశ్రీని సన్మానించారు. కార్యక్రమంలో చైతన్య కళాశాల డీన్ తిరుపతిరావు, ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, ఎస్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, ఏబీవీపీ విభాగ కన్వీనర్ ప్రసాద్, లోకేష్, హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు మారుతీ వరప్రసాద్, హనుమంత్ ప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, శేషు, మైలా హరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం పెరుగుదల

ఐసీఆర్‌పీ అద్దంకి వెంకట రమణ



సాగు అంశాలను వివరిస్తున్న వెంకటరమణ

వల్లభాపురం (కొల్లిపర): రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయం చేయటం వలన రసాయన ఎరువులు వల్ల భూసారం కోల్పోయిన భూమి మళ్లీ భూసారం పెరుగుతుందని ఐసీఆర్‌పీ అద్దంకి వెంకట రమణ అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మంగళవారం రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, మొక్కలు ఎదుగుదలకు చాపబెల్లం ద్రావణం ఏవిధంగా తయారు చేసుకోవాలని గురించి అవగాహన కల్పించారు. నేడు రసాయన ఎరువులు వాడటం వల్ల గతంలో ఎన్నడూ లేని విధంగా రోజుకు ఒక రకమైన కొత్త రోగాల బారిన ప్రజలు పడతున్నారు. వీటి నుంచి తప్పించుకోవాలంటే ప్రతి రైతు పూర్వీకులు అనుసరించిన సేంద్రియ ఎరువుల ద్వారా వ్యవసాయం చేయడం వల్ల సాధ్యమవుతుందన్నారు. అనంతరం మొక్కల ఎదుగుదలకు అవసరమైన చాప బెల్లం ద్రావణం రైతులు ఇంటి వద్దనే ఏ విధంగా తయారు చేసుకోవాలని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఐసీఆర్‌పీలు, ఇంటర్నల్ కమ్యూనికేషన్ పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా తెనాలి డీసీల ఎన్నికలు



తెనాలి డీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన పెమ్మసాని శ్రీనివాసరావు



కొలకలూరు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జొన్నల మురళీకృష్ణరెడ్డి, తాడిబోయిన నాగేశ్వరరావు

తెనాలి: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో రెండో దశలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం జరిగాయి. స్థానిక కృష్ణాపశ్చిమ డివిజను కార్యాలయంలో జరిగిన తెనాలి పరిధిలోని రెండు కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. డీసీ నెంబరు–40 తెనాలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడుగా పెమ్మసాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా యలవర్తి రఘుబాబు ఎన్నికయ్యారు. డీసీ నంబరు–39 కొలకలూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా జొన్నల మురళీకృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. వీరిని రైతుసంఘ నాయకులు, కూటమి పార్టీల నేతలు అభినందించారు. ఎన్నికలను జలవనరుల శాఖ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, జిల్లా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీరు పులిపాటి వెంకటరత్నం పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

ఫ్యాప్టో రేపల్లె కన్వీనర్ పీడీ సోషలిజం



నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

రేపల్లె రూరల్: విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసి సమాజాభివృద్ధికి దోహదపడే ఉపాధ్యాయుల భద్రత కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఫ్యాప్టో రేపల్లె పట్టణ కన్వీనర్ పీడీ సోషలిజం అన్నారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహం సెంటరులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అటువంటి ఉపాధ్యాయులపై రోజురోజుకు భౌతికదాడులు జరుగుతున్నాయని, దాడులను నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు ఎంవీబీ సుబ్రహ్మణ్యం, బొర్రా వేణుమాధవ్, ఎం.అంకయ్య, జొన్నలగడ్డ సుబ్బారావు, రేపల్లె పాత తాలూకాలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.